


నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
EVENING EDITION
www.suryaa.com పేజీలు: 02
4PM



# రాహుల్ 2.0
# భారత్ న్యాయ యాత్ర

**మణిపూర్ నుంచి ముంబై వరకు**
**జనవరి 14 నుండి మార్చి 20 వరకు**


**6200** కిలో మీటర్లు **14** రాష్ట్రాలు **85** జిల్లాలు

కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ మరోసారి పాదయాత్ర చేపట్టనున్నారు. 'భారత్ న్యాయ యాత్ర' పేరుతో రాహుల్ పాదయాత్ర చేయబోతున్నారని బుధవారం ఏఐసీసీ కార్యాలయం అధికారికంగా ప్రకటించింది. వచ్చే ఏడాది జనవరి 14వ నుంచి మార్చి 20 వరకు 14 రాష్ట్రాల గుండా ఈ యాత్ర కొనసాగనుంది. మణిపూర్‌లో మొదలయ్యే భారత్ న్యాయ యాత్ర.. ముంబై వరకు 6,200 కిలోమీటర్ల మేర సాగనుంది. బస్సు, కాలి నడక ద్వారా రాహుల్ గాంధీ 'భారత్ న్యాయ యాత్ర' కొనసాగుతుందని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ తెలిపారు. భారత్ జోడో యాత్ర ఇచ్చిన గొప్ప అనుభవంతో.. రాహుల్ ఈ యాత్ర చేయబోతున్నారని చెప్పారు. ఈ యాత్రలో యువతను, మహిళలను, అణగారిన వర్గాలతో రాహుల్ ముఖాముఖి అవుతారని వేణుగోపాల్ వెల్లడించారు. ఈ యాత్ర రూట్ వివరాలను త్వరలో వెల్లడిస్తామని చెప్పారు. మణిపుర్ నుంచి మొదలయ్యే భారత్ న్యాయ యాత్ర.. నాగాలాండ్, అస్సాం, మేఘాలయ, పశ్చిమ బెంగాల్, బిహార్, ఝార్ఖండ్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, గుజరాత్ మీదుగా చివరకు మహారాష్ట్రకు చేరుతుంది. మొత్తం 14 రాష్ట్రాల్లోని 85 జిల్లాల్లో రాహుల్ గాంధీ యాత్ర చేస్తారు. గతంలో మాదిరిగా పూర్తిగా పాదయాత్ర కాకుండా.. ఈసారి బస్సు యాత్ర ఎక్కువగా ఉంటుందట. ప్రతి రాష్ట్రంలో నేతలు ఈ యాత్రలో పాల్గొంటారట. దేశ ప్రజలను ఏకం చేసేందుకు కొద్ది నెలల క్రితం రాహుల్ గాంధీ 'భారత్ జోడో యాత్ర' చేపట్టిన విషయం తెలిసిందే. గతేడాది సెప్టెంబరు 7న రాహుల్ భారత్ జోడో యాత్ర చేపట్టారు. దాదాపు ఐదు నెలల పాటు 4, 500 కిమీల మేర 12 రాష్ట్రాల్లో సాగింది. కన్యాకుమారిలో మొదలైన ఈ యాత్ర.. కశ్మీర్‌లోని లాల్‌చౌక్‌లో ముగిసింది. అప్పుడు దక్షిణ భారత్ నుంచి ఉత్తరాది వరకు యాత్ర చేపట్టిన రాహుల్.. ఈ సారి తూర్పు నుంచి పశ్చిమ వరకు చేయనున్నారు.

# కాంగ్రెస్ గ్యారెంటీల అప్లికేషన్ విడుదల

## ప్రజాపాలన అప్లికేషన్ ఫామ్ రిలీజ్ చేసిన సీఎం రేవంత్ రెడ్డి

గత పదేళ్లుగా ప్రభుత్వం ప్రజలకు ఎంత దూరంగా ఉందో ప్రజావాణి చూస్తే అర్థమవుతోందని తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి అన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ఆరు గ్యారంటీలకు సంబంధించి దరఖాస్తు పత్రాన్ని బుధవారం సచివాలయంలో మంత్రులతో కలిసి విడుదల చేశారాయన. ప్రజా పాలన పేరిట విడుదల చేసిన ఈ దరఖాస్తు ద్వారా ప్రభుత్వమే ప్రజల వద్దకు వెళ్తుందని చెప్పారాయన. ఆరు గ్యారంటీల దరఖాస్తును ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఇతర మంత్రులు ఆవిష్కరించారు. లోగోను కూడా ఆవిష్కరించారు. ప్రభుత్వం ప్రకటించిన సంక్షేమ పథకాల్ని పొందేందుకు ఈ ఒకే దరఖాస్తును సమర్పిస్తే సరిపోతుంది. రేపటి నుంచి జనవరి ఆరో తేదీ వరకు దరఖాస్తుల్ని స్వీకరించనున్నారు. కాగా, ఈ కార్యక్రమంలో మంత్రులు కోమటిరెడ్డి, పొంగులేటి, కొండా సురేఖ, తుమ్మల నాగేశ్వరరావు, సీఎస్ శాంత కుమారి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాటను నిలబెట్టుకుంది. అర్హులైన లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అందిస్తాం. కాంగ్రెస్ ఆరు గ్యారంటీలను తెలంగాణ ప్రజలకు ఇచ్చింది. ప్రజలకు పదేళ్లుగా ప్రభుత్వం అందుబాటులో లేదు. ప్రజావాణికి వస్తున్న స్పందనే ఆ విషయం చెబుతోంది. ప్రజావాణిలో అన్ని సమస్యల్ని పరిష్కరిస్తాం. ప్రజలను ప్రభుత్వం వద్దకు రప్పించడం కాదు.. ప్రభుత్వమే ప్రజల వద్దకు తీసుకెళ్లమే ప్రజా పాలన ఉద్దేశం. రేపటి నుంచి జనవరి ఆరో తేదీ వరకు గ్రామ సభలు నిర్వహిస్తారు. అర్హులైన లబ్ధిదారులకు పథకాలు అందిస్తాం. నిస్సహాయులకు సహాయం అందించడమే మా ప్రభుత్వ లక్ష్యం. ప్రభుత్వమే మీ దగ్గరకు వస్తుంది అని ప్రజలను ఉద్దేశించి సీఎం రేవంత్ చెప్పారు. ప్రభుత్వం, అధికారులకు దగ్గరైనప్పుడు సమస్యలు పరిష్కారం అవుతాయి. గ్రామసభల్లో దరఖాస్తు పత్రాలు అందుబాటులో ఉంటాయి. అర్హులైన ప్రతీ ఒక్కరికి గ్యారంటీలను అందిస్తాం. మారుమూల పల్లెకూ సంక్షేమ పథకాలు అందాలన్నదే మా లక్ష్యం. ప్రభుత్వమే మీ దగ్గరకు వస్తుంది. ప్రతీ






మండలంలో రెండు గ్రూపులు ఏర్పాటు చేస్తాం. మహిళలకు, పురుషులకు వేరువేరుగా కౌంటర్లు ఏర్పాటు చేయడం జరిగింది. ఒక గ్రూపునకు ఎండీఓ, మరో గ్రూప్‌నకు ఎంఆర్‌వో బాధ్యత వహిస్తారు. ఎవరి కోసం ఎదురు చూడకండి.. ఎవరి దగ్గరకు వెళ్లకండి. అన్ని గ్రామ పంచాయతీలలో అధికారులు అందుబాటులో ఉంటారు. జనవరి ఆరో తేదీ తర్వాత కూడా ఎంపీడీవో, ఎంఆర్‌వో ఆఫీసుల్లో అభయ హస్తం దరఖాస్తు చేసుకోవచ్చు. త్వరలోనే రేషన్‌కార్డులు ఇస్తాం. రేషన్‌కార్డులు ఉంటేనే సంక్షేమ పథకాలు అందుతాయి. పదేళ్ల గడీల నుంచి పాలన గ్రామాలకు తీసుకువస్తున్నాం. ఇచ్చిన మాట ప్రకారం ప్రజల దగ్గరకు పాలనను పంపిస్తున్నాం' అని స్పష్టం చేశారు.

### ముందుంది ముసళ్ళ పండుగ.. అన్నీ వసూలు చేస్తాం: సీఎం రేవంత్‌రెడ్డి

బీఆర్ఎస్ పదేళ్లపాలనలో జరిగిన అవినీతినంతా బయటపెట్టి.. ఆ పార్టీ నేతలు తిన్నదంతా కక్కించి తీరతామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మరోసారి ఉద్ఘాటించారు. బుధవారం ఆరు గ్యారెంటీల దరఖాస్తు ఫామ్ 'ప్రజా పాలన' విడుదల సందర్భంగా.. గత ప్రభుత్వ మంత్రులపై సంచలన వ్యాఖ్యలే చేశారాయన. "ఎన్నికల సమయంలో చెప్పినట్లే గడిల పాలనను ప్రజల దగ్గరకు తెస్తున్నాం. ప్రజావాణితో సమస్యలు పరిష్కారం అవట్లేదని కేటీఆర్ అంటున్నారు. తన దగ్గరున్న రూ.లక్ష కోట్లలో.. కేటీఆర్ సాయం చేసింది రూ.లక్షే. ప్రజావాణి లక్ష్యం నెరవేరినట్లే. మిగిలినవి కూడా కేటీఆర్‌తో ఇప్పిస్తాం. ప్రజలకు ఆ రూ.లక్ష కోట్లు పంపిస్తాం" అని సీఎం రేవంత్ అన్నారు.



## హైదరాబాద్‌కు ఎల్లో అలర్ట్


రోజూరోజుకు చలి విపరీతంగా పెరుగుతోంది. ఈ నేపథ్యంలో హైదరాబాద్ సిటీకి వాతావరణ శాఖ ఎల్లో అల్టర్ జారీ చేసింది. నగరంలో రాబోయే రెండు రోజులు రాత్రి వేళల్లో టెంపరేచర్ గణనీయంగా పడిపోతుందని, 13, 14 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముందని స్పష్టం చేసింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ సూచించింది.



## మరోసారి ఆస్పత్రిలో చేరిన హీరో విజయ్‌కాంత్

కొన్నాళ్ల ముందు తీవ్ర అనారోగ్య సమస్యలతో ఆస్పత్రిలో చేరిన తమిళ స్టార్ హీరో విజయ్ కాంత్.. కోలుకుని ఇంటికెళ్లిపోయారు. ఇప్పుడు మరోసారి ఆస్పత్రిలో చేరారు. దీంతో ఈయన అభిమానులు ఆందోళన చెందుతున్నారు. అయితే ఇది రెగ్యులర్ చెకప్ కోసమేనని కుటుంబ సభ్యులు చెబుతున్నారు.

## జనసేనలోకి వైసీపీ ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్?



విశాఖ నగరానికి చెందిన వైసీపీ ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్ ఆ పార్టీకి గుడ్‌బై చెప్పనున్నారని ప్రచారం జరుగుతోంది. ఆయన జనసేన పార్టీలో చేరనున్నట్లు తెలుస్తోంది. ఇవాళ, రేపు జనసేనాని పవన్ కల్యాణ్‌ను వంశీకృష్ణ కలిసే అవకాశాలున్నాయని రాజకీయ వర్గాల సమాచారం. ఈ మేరకు ఆయన తర్వలోనే వైసీపీకి రాజీనామా చేసి, జనసేన కండువా కప్పుకోనున్నట్లు చర్చ జరుగుతోంది.

## గవర్నర్ తమిళిసై పొలిటికల్ రీ ఎంట్రీ..

తెలంగాణ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ మళ్లీ పొలిటికల్ ఎంట్రీ ఇస్తున్నారనే వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. తమిళిసై ఢిల్లీ పర్యటన నేపథ్యంలో వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో పోటీ కోసమే హస్తినకు వెళ్లారనే వార్తలు వినిపిస్తున్నాయి. తమిళనాడు నుంచే తమిళిసై బరిలో నిలిచే అవకాశాలు ఉన్నాయి. అయితే, తెలంగాణ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఆసక్తి చూపుతున్నారట. సొంత రాష్ట్రం తమిళనాడు నుంచి ఆమె పోటీ చేసేందుకు సిద్ధమయ్యారనే వార్తలు వినిపిస్తున్నాయి. ఇక, తన ఎంపీ అభ్యర్థిత్వంపై ఆమె అమిత్ షాను కోరనున్నట్లు తెలుస్తోంది. తమిళనాడులోని సౌత్ చెన్నై లేదా తిరునల్వేలి నుంచి పోటీకి ఆమె రెడీ అయినట్లు సమాచారం. ఇదిలా ఉండగా.. తమిళిసై గతంలో రెండు సార్లు ఎంపీగా పోటీ చేసి ఓటమి పాలయ్యారు. 2009లో చెన్నై నార్త్, 2019లో తూత్తూకూడి నుంచి ఎంపీగా పోటీ చేసి పరాజయం చవి చూశారు. మరో



మూడు పర్యాయాలు అసెంబ్లీకి పోటీ చేసినా.. ఆమె గెలుపు తలుపు తట్టలేదు. పార్టీకి ఆమె చేసిన సేవలను గుర్తించిన కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం 2019 సెప్టెంబర్‌లో తమిళిసైని తెలంగాణ గవర్నర్‌గా నియమించారు. 2021 నుంచి పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు. అయితే, రాజ్యాంగబద్ధమైన పదవిని వదిలి ఆమె ప్రత్యక్ష రాజకీయాల్లోకి రావాలని చూస్తున్నట్టు సమాచారం.

## ఢిల్లీని కప్పేసిన పొగమంచు..

### 110 విమానాల రాకపోకలకు అంతరాయం

ఎముకలు కొరికే చలితో దేశ రాజధాని దిల్లీ వణుకుతోంది. ఉష్ణోగ్రతలు దారుణంగా పడిపోవడంతో పొగమంచు నగరాన్ని కప్పేసింది. దీంతో రాజధాని వాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అటు రవాణా వ్యవస్థపై పొగమంచు పెను ప్రభావం చూపిస్తోంది. విమానాలు, రైళ్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. చలి పరిస్థితులు తీవ్రంగా ఉండటంతో ఇప్పటికే వాతావరణ శాఖ దిల్లీలో రెడ్ అలర్ట్ జారీ చేసింది. పొగమంచు దట్టంగా వ్యాపించడంతో ఉదయం కూడా రాత్రిని తలపిస్తోంది. కొన్ని ప్రాంతాల్లో 50 మీటర్ల దూరంలో ఉన్న వాహనాలు కూడా కనిపించనంతగా మంచు కమ్మేసింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అటు గాలి నాణ్యత కూడా పడిపోయింది. దిల్లీలో



కనిష్ఠ ఉష్ణోగ్రత 7 డిగ్రీలకు తగ్గింది. పొగమంచు కారణంగా దిల్లీ ఎయిర్‌పోర్టులో విమానాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దాదాపు 110 దేశీయ, అంతర్జాతీయ విమాన సర్వీసులు ఆలస్యమవుతున్నట్లు ఎయిర్‌పోర్టు అధికారులు వెల్లడించారు.

## ప్రారంభమైన సింగరేణి ఎన్నికల పోలింగ్..

### 144 సెక్షన్ అమలు




సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల పోలింగ్‌కు సర్వం సిద్ధమైంది. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు పోలింగ్ జరగనుంది. దక్షిణ భారత్‌లోనే ఏకైక బొగ్గు ఉత్పత్తి సంస్థగా నిలిచిన సింగరేణి పరిధిలో 24 భూగర్భ, 18 ఓపెన్ కాస్ట్ గనులు విస్తరించి ఉన్నాయి. సింగరేణి ఎన్నికల్లో మొత్తం 39,773 మంది కార్మికులు ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. ఎన్నికల విధులకు 650 మంది సిబ్బంది, బందోబస్తుకు 460 మంది పోలీసులను కేటాయించారు. రహస్య బ్యాలెట్ పద్ధతిలో ఎన్నికలు జరుగుతాయి. ఉత్తర తెలంగాణలో గోదావరి తీరంలోని ఆరు జిల్లాల పరిధిలో 11 ఏరియాల్లో సింగరేణి ఎన్నికలు జరగనున్నాయి. 11 ఏరియాల్లో 84 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. మంచిర్యాల, కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలో 31 పోలింగ్ కేంద్రాల్లో 14,985 మంది ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. రామగుండం రీజియన్‌లో 11వేల 819 మంది కార్మికులు ఓటు హక్కు కలిగి ఉన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని నాలుగు ఏరియాల్లో 7వేల 476 మంది కార్మికులు ఓటు వేయనున్నారు. దానికి సంబంధించి.. 23 పోలింగ్ స్టేషన్లు, నాలుగు కౌంటింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రాల దగ్గర 144 సెక్షన్ అమలులో ఉంది. ఇక.. సాయంత్రం ఐదు గంటలకు సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల పోలింగ్ ముగియనుంది. రాత్రి ఏడు గంటలకు కౌంటింగ్ ప్రారంభం కానుండగా.. అర్ధరాత్రి 12 గంటల తర్వాత ఫలితాలు వెల్లడయ్యే అవకాశాలు ఉన్నాయి. ముందుగా ఏరియా వారీగా విజేతలను ప్రకటిస్తారు. ఆ తర్వాత.. మొత్తం పోలైన ఓట్లలో సగం కంటే ఎక్కువ ఓట్లు సాధించిన సంఘానికి గుర్తింపు హోదా కేటాయిస్తారు.

## రెజ్లింగ్ క్రీడాకారులకు రాహుల్ గాంధీ మద్దతు

కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్ గాంధీ ప్రముఖ రెజ్లింగ్ క్రీడాకారుడు బజరంగ్ పూనియా, ఇతర రెజ్లింగ్ క్రీడాకారులను హర్యానాలోని ఝుజ్జర్ జిల్లాలో ఛారా గ్రామంలో కలుసుకున్నారు. ఆయన బుధవారం ఉదయమే.. రెజ్లింగ్ క్రీడాకారులు నిరసన వ్యక్తం చేస్తున్న ప్రదేశానికి వెళ్లారు. భారత రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్ష ఎన్నికకు సంబంధించి.. రెజ్లింగ్ క్రీడాకారులు నిరసన తెపుతున్న విషయం తెలిసిందే. భారత రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్షుడిగా సంజయ్ సింగ్ ఎంపికను నిరసిస్తూ... బజరంగ్ పూనియా తనకు వచ్చిన పద్మశ్రీ అవార్డును ఎనక్కి ఇస్తున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ సమయాలో బుధవారం ఎంపీ రాహుల్ గాంధీ క్రీడాకారులతో భేటీ అయి వారికి మద్దతుగా నిలిచారు.మేము రెజ్లింగ్ ప్రాక్టిస్ చేస్తున్న క్రమంలో అకస్మత్తుగా మా వద్దకు ఆయన చేరుకున్నారు. ఆయన ఉదయమే 6.15 గంటలకు ఇక్కడికి వచ్చారు. మాతో పాటు కాసేపు వ్యాయామం చేశారు. ఆయనకు క్రీడల పట్ల ఉన్న అనుభవాలను మాతో పంచుకున్నారు. రాహుల్ గాంధీకి క్రీడాల పట్ల చాలా పరిజ్ఞానం ఉంది' అని రెజ్లింగ్ కోచ్ వీరేంద్ర ఆర్య పేర్కొన్నారు. బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషన్ శరణ్ సింగ్‌కు నమ్మిన బంటుగా పేరున్న సంజయ్ కుమార్‌ను.. భారత రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్షుడిగా ఎన్నికపై నిరసన తెలుపుతూ.. తాజాగా రెజ్లర్ వినేశ్ ఫొగాట్ కూడా అర్జున, మేజర్ ధ్యాన్‌చంద్ ఖేల్ రత్న అవార్డులు వెనక్కి ఇస్తున్నట్లు ప్రకటించారు. రెజ్లర్లు రోడ్డెక్కి పోరాడుతున్న క్రీడాశాఖ నుంచి స్పష్టమైన హామీ లభించకపోవడం గమనార్హం.



# బంపర్ ఆఫర్ కొట్టేసిన త్రిప్తి డిమ్రీ

యానిమల్ మూవీతో త్రిప్తి డిమ్రీ ఓవర్ నైట్ క్రేజ్ ను సొంతం చేసుకుంది. ఆమె అంతకుముందు కొన్ని మంచి సినిమాల్లో నటించినప్పటికీ, యానిమల్ చిత్రంతో సూపర్ క్రేజ్ ఏర్పడింది. అప్పటి నుండి, త్రిప్తి రాబోయే ప్రాజెక్ట్‌ల గురించి చాలా పుకార్లు వచ్చాయి. బాలీవుడ్ బిగ్గీ ఆషికీ 3లో త్రిప్తి దిమ్రీ లేడీ లీడ్ రోల్ లో ఎంపికైనట్లు తాజా వార్త. ఈ చిత్రంలో కార్తీక్ ఆర్యన్ హీరోగా కనిపించనున్నారు. ఈ ఫ్రాంచైజీ ప్రేక్షకులలో బాగా ప్రాచుర్యం పొందింది. కార్తిక్ ఆర్యన్ మరియు త్రిప్తి డిమ్రీల కలయికతో ఆషికీ 3 ఇప్పుడు హాట్ టాపిక్ గా మారుతోంది. త్రిప్తి డిమ్రీ ప్రభాస్ స్పిరిట్‌లో భాగమని కొన్ని పుకార్లు వచ్చాయి. అయితే నటి వాటిని తోసిపుచ్చింది. బర్ఫీ మరియు లూడో దర్శకుడు అనురాగ్ బసు ఈ మ్యూజికల్ రొమాంటిక్ డ్రామాకి దర్శకత్వం వహించనున్నారు. T-సిరీస్‌కు చెందిన భూషణ్ కుమార్ ఈ సినిమా ను నిర్మించనున్నారు. అతి త్వరలో సినిమా సెట్స్ పైకి వెళ్లనుంది.





# తొలి రోజు తడబడ్డ టీమిండియా..

సౌతాఫ్రికా గడ్డపై టెస్ట్ సిరీస్ వేట మొదలుపెట్టిన టీమిండియా తొలి రోజు తడబడి కోలుకుంది. కగిసో రబాడ (5/44) పేస్ దెబ్బకు కుదేలైన ఇండియా ఇన్నింగ్స్‌ను కేఎల్ రాహుల్ (105 బాల్స్‌లో 10 ఫోర్లు, 2 సిక్స్‌లతో 70 బ్యాటింగ్) ఒంటరి పోరాటంతో ఆదుకున్నాడు. దీంతో ఇరుజట్ల మధ్య మంగళవారం మొదలైన తొలి టెస్ట్‌లో ఆట ముగిసే సమయానికి ఇండియా తొలి ఇన్నింగ్స్‌లో 59 ఓవర్లలో 208/8 స్కోరు చేసింది. రాహుల్‌తో పాటు మహ్మద్ సిరాజ్ (0 బ్యాటింగ్) క్రీజులో ఉన్నాడు. విరాట్ కోహ్లీ (38), శ్రేయస్ అయ్యర్ (31) ఓ మాదిరిగా ఆడారు.

24 రన్స్‌కే 3 వికెట్లు..

పిచ్ పేసర్లకు అనుకూలంగా ఉండటం, వాతావరణం మేఘావృతం కావడంతో సఫారీ కెప్టెన్ బవుమ టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్నాడు. దీంతో బ్యాటింగ్‌కు దిగిన ఇండియా టాప్ ఆర్డర్‌ను.. కొత్త బాల్‌తో పేసర్లు రబాడ, నాండ్రే బర్గర్ (2/50) బెంబేలెత్తించారు. పేస్, స్వింగ్‌తో పాటు వేరియబుల్ బౌన్స్‌ను రాబడుతూ ఆరంభం నుంచే ఓపెనర్లు యశస్వి జైస్వాల్ (17), కెప్టెన్ రోహిత్ (5)ను ముప్పతిప్పలు పెట్టారు. ఐదో ఓవర్‌లో రబాడ వేసిన షార్ట్ బాల్‌ను హుక్ చేసిన రోహిత్ బౌండ్రీ వద్ద బర్గర్‌కు చిక్కాడు. కొద్దిసేపటికే బర్గర్ డబుల్ స్ట్రోక్ ఇచ్చాడు. నాలుగు బాల్స్ తేడాలో యశస్వి, శుభ్‌మన్ గిల్ (2)ను ఔట్ చేసి షాకిచ్చాడు. దీంతో ఇండియా 24/3తో కష్టాల్లో పడింది. ఇన్నింగ్స్‌ను గట్టెక్కించే బాధ్యత తీసుకున్న శ్రేయస్, కోహ్లీని కూడా ఈ ఇద్దరు బాగా ఇబ్బంది పెట్టారు. 4 రన్స్ వద్ద శ్రేయస్ ఇచ్చిన క్యాచ్‌ను పాయింట్‌లో జెన్సెన్ (1/52) వదిలేశాడు. ఇక్కడి నుంచి ఈ ఇద్దరు ఆచితూచి ఆడారు. రబాడను వదిలేసి మిగతా వారి బౌలింగ్‌లో కోహ్లీ నాలుగు ఫోర్లు కొట్టి గాడిలో పడ్డాడు. 33 రన్స్ వద్ద విరాట్ ఇచ్చిన క్యాచ్‌ను స్క్వేర్ లెగ్‌లో జోర్జి జారవిడిచాడు. వీరిద్దరు నాలుగో వికెట్‌కు 67 రన్స్ జోడించడంతో ఇండియా 91/3 స్కోరుతో లంచ్‌కు వెళ్లింది.

రబాడ పేస్ దెబ్బ

సెకండ్ సెషన్‌లో రబాడ ఇన్ కమింగ్ డెలివరీస్‌తో జోరు చూపెట్టాడు. ఓల్డ్ బాల్‌ను రెండువైపులా స్వింగ్ చేస్తూ ఫస్ట్ ఓవర్‌లోనే ఫలితాన్ని రాబట్టాడు. అద్భుతమైన ఫుల్ లెంగ్త్ బాల్‌తో శ్రేయస్‌ను క్లీన్ బౌల్డ్ చేశాడు. తర్వాత ఇన్‌కమింగ్ డెలివరీస్‌తో కోహ్లీని డెడ్ డిఫెన్స్‌లో పడేశాడు. ఈ క్రమంలో మరో మూడు ఓవర్ల తర్వాత పర్ఫెక్ట్ లెంగ్త్‌తో వేసిన బాల్ విరాట్ బ్యాట్ ఎడ్జ్‌ను తాకుతూ కీపర్ చేతుల్లోకి వెళ్లింది. ఇండియా స్కోరు 107/5గా మారింది. కొత్తగా వచ్చిన రాహుల్ డిఫెన్స్‌కు ప్రాధాన్యమిస్తే.. రెండో ఎండ్‌లో రబాడ వరుసగా షాక్‌లిచ్చాడు. 35వ ఓవర్‌లో అశ్విన్ (8)ను ఔట్ చేయడంతో శార్దూల్ ఠాకూర్ (24) క్రీజులోకి వచ్చాడు. రాహుల్‌తో కలిసి ఓ 10 ఓవర్ల పాటు సింగిల్స్‌తో ఇన్నింగ్స్‌ను నడిపించిన శార్దూల్ కూడా రబాడ పేస్ ముందు నిలవలేకపోయాడు. 47వ ఓవర్‌లో అతను ఔట్ కావడంతో రబాడ 14వ సారి ఐదు వికెట్ల హాల్‌ను ఖాతాలో వేసుకున్నాడు. 176/7తో ఇండియా టీ బ్రేక్‌కు వెళ్లింది. మూడో సెషన్ స్టార్టింగ్‌లో ఎక్కువ బ్యాటింగ్ చాన్స్ తీసుకున్న రాహుల్ 80 బాల్స్‌లో హాఫ్ సెంచరీ చేయగా, బుమ్రా (1) నిరాశపర్చాడు. చివరకు 208/8 స్కోరు ఉన్న దశలో బ్యాడ్ లైట్, వర్షం అంతరాయం కలిగించడంతో అంపైర్లు తొలి రోజు ఆటను ఆపేశారు.

బవుమాకు గాయం!

తొలి టెస్ట్‌లో నిలకడగా ఆడుతున్న సౌతాఫ్రికాకు ఎదురుదెబ్బ తగిలింది. కెప్టెన్ టెంబా బవుమ హ్యామ్‌స్ట్రింగ్ ఇంజ్యూరీకి గురయ్యాడు. ఇన్నింగ్స్ 20వ ఓవర్‌లో కోహ్లీ ఎక్స్‌ట్రా కవర్స్‌లోకి కొట్టిన డ్రైవ్‌ను ఛేజ్ చేసే క్రమంలో బవుమ డైవ్ చేశాడు. తర్వాత నొప్పితో ఇబ్బందిపడిన అతన్ని ఫిజియో గ్రౌండ్ బయటకు తీసుకెళ్లాడు. బవుమ ఎడమ తొడ కండరం చీరుకుపోయినట్లు స్కానింగ్‌లో తేలడంతో మళ్లీ గ్రౌండ్‌లోకి రాలేదు. పూర్తి స్థాయి మెడికల్ రిపోర్ట్స్ తర్వాత అతను మ్యాచ్‌లో ఆడటంపై నిర్ణయం తీసుకోనున్నారు. ఎల్గర్ స్టాండ్ ఇన్ కెప్టెన్‌గా వ్యవహరిస్తున్నాడు.

సంక్షిప్త స్కోర్లు: ఇండియా తొలి ఇన్నింగ్స్: 59 ఓవర్లలో 208/8 (రాహుల్ 70*, కోహ్లీ 38, 5/44).

వరల్డ్ టెస్ట్ చాంపియన్‌షిప్‌లో హయ్యెస్ట్ రన్స్ చేసిన తొలి ఇండియన్ బ్యాటర్ విరాట్ కోహ్లీ (57 ఇన్నింగ్స్‌లో 2101). కెప్టెన్ రోహిత్ శర్మ (42 ఇన్నింగ్స్‌లో 2097)ను అధిగమించాడు.

# అమ్మోనియా గ్యాస్ లీక్.. 12 మందికి అస్వస్థత

తమిళనాడులోని కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్‌లో ఘోర ప్రమాదం జరిగింది. ఈ పరిశ్రమ పైపులైన్ నుంచి అమ్మోనియా గ్యాస్ లీక్ అయింది. ఈ ప్రమాదంలో 12 మంది ఆసుపత్రి పాలైనట్లు పోలీసులు తెలిపారు.

అమ్మోనియా అన్‌లోడ్ చేస్తున్న సబ్-సీ పైప్‌లైన్‌లో లీకులు ఏర్పడినట్లు సమాచారం. ఎన్నూర్‌లో ఉన్న కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ ఒక ప్రైవేట్ కంపెనీ. ఎరువులు తయారు చేస్తుంది. ఇందుకు అమ్మోనియాను ముడిసరుకుగా ఉపయోగిస్తారు. అయితే.. మంగళవారం అర్ధరాత్రి సమయంలో పరిశ్రమ పైప్‌లైన్ నుంచి అమ్మోనియా గ్యాస్ లీక్ అయింది. రాత్రి 12:45 సమయంలో పోలీసులకు సమచారం అందింది. పైప్‌లైన్ ప్రీ-కూలింగ్ ఆపరేషన్ సమయంలో ఈ ఘటన జరిగిందని పోలీసులు తెలిపారు. గ్యాస్ లీకేజీ వల్ల స్థానిక పెరియకుప్పం, చిన్నకుప్పం వంటి గ్రామాల ప్రజలు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఘాటైన వాసన రావడంతో శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది ఏర్పడిందని తెలిపారు. పోలీసులకు ఫిర్యాదు చేశారు. వెంటనే అప్రమత్తమైన ఆరోగ్య శాఖా అధికారులు.. ఆయా గ్రామాల్లో అంబులెన్స్‌లు, ఇతర ట్రాన్స్‌పోర్టు సదుపాయాలను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం 12 మంది ఆస్పత్రిలో చేరినట్లు అధికారులు తెలిపారు.



ప్రస్తుతం వారి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వెల్లడించారు. గ్యాస్ లీకేజీతో స్థానిక గ్రామాల ప్రజలను పునరావాస ప్రాంతాలకు తరలించినట్లు అధికారులు తెలిపారు. సముద్ర తీరానికి సమీపంలో అమ్మోనియా అన్‌లోడ్ చేస్తున్న సబ్-సీ పైప్‌లైన్‌లో మంగళవారం రాత్రి 11.30 గంటలకు లీకు ఏర్పడినట్లు కోరమండల్ సంస్థ తెలిపింది. వెంటనే అమ్మోనియా సరఫరాను తక్కువ చేసి పరిస్థితిని సాధారణ స్థితికి తీసుకువచ్చామని పేర్కొంది. ఘటనపై సంబంధిత అధికారులకు సమాచారం అందించామని వెల్లడించింది. కోరమండల్ ఎల్లప్పుడూ అత్యున్నత భద్రతా ప్రమాణాలకు కట్టుబడి ఉంటుందని స్పష్టం చేసింది.

# కంటి చికిత్స చేస్తూ వృద్ధురాలిని కొట్టిన డాక్టర్


కంటి చికిత్సకు వెళ్లిన ఓ వృద్ధురాలి పట్ల డాక్టర్ దారుణంగా ప్రవర్తించాడు. వృద్ధురాలికి కంటి చికిత్స చేస్తూ ఆమెను కొట్టాడు. ఈ ఘటన చైనాలోని గైగాంగ్‌లోని ఓ ఆస్పత్రిలో 2019లో చోటు చేసుకోగా, దానికి సంబంధించిన ఓ వీడియో ప్రస్తుతం వైరల్ అవుతోంది. వివరాల్లోకి వెళ్తే.. వుహాన్‌లోని ఓ హాస్పిటల్‌కు కంటి చికిత్స కోసమని 82 ఏండ్ల వృద్ధురాలు వెళ్లింది. అయితే ఆమెకు చికిత్స ప్రారంభించే ముందు.. అనస్థీషియా ఇచ్చారు. కానీ ఆమెపై ఆ అనస్థీషియా అంతగా ప్రభావం చూపలేదు. సర్జరీ కొనసాగుతుండగా ఆమె తల, కనుగుడ్లు కదిలించింది. దీంతో కోపంతో ఊగిపోయిన డాక్టర్.. ఆమె తలపై బలంగా కొట్టాడు. చికిత్సకు సహకరించాలని గట్టిగా అరిచాడు. డాక్టర్ మహిళపై దాడి చేసిన ఘటనకు సంబంధించిన వీడియో ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతోంది. దీంతో ఆ ఆస్పత్రి యాజమాన్యం స్పందించింది. బాధిత మహిళకు క్షమాపణలు చెప్పింది. ఆమెకు పరిహారం కింద రూ. 5,800 చెల్లించింది. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని ఆస్పత్రి యాజమాన్యం తెలిపింది. వృద్ధురాలిపై దాడి చేసిన డాక్టర్‌ను సస్పెండ్ చేశారు.





# విశాఖలో పొగమంచుతో ఒకదానికొకటి ఢీకొన్న ఐదు వాహనాలు

విశాఖ కొమ్మాది కూడలిలో బుధవారం ఉదయం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. పొగమంచు కారణంగా ఐదు వాహనాలు ఒకదానికొకటి ఢీకొన్నాయి. ప్రైవేటు బస్సు, ట్యాంకర్, మూడు కార్లు ఢీకొని ప్రమాదం చోటుచేసుకుంది. అయితే.. ఈ ఘటనలో ప్రాణనష్టం తప్పడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. ఈ ప్రమాదం కారణంగా కొమ్మాది కూడలిలో భారీగా వాహనాలు నిలిచిపోయాయి. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.



# కొనసాగుతున్న బుల్ జోరు..

అంతర్జాతీయ మార్కెట్ సూచీల సానుకూల ప్రభావంతో దేశీయ సూచీలు బుధవారం లాభాల్లో ట్రేడింగ్‌ను మొదలుపెట్టాయి. సెన్సెక్స్ ఉదయం 9.19 సమయంలో 250 పాయింట్ల లాభంతో 71,587 వద్ద, నిఫ్టీ 80 పాయింట్ల లాభంతో 21,521 వద్ద కొనసాగుతున్నాయి. కన్సాయి నెరోలాక్ పెయింట్, నువోకో విస్టాస్ కార్ప్, జీహెచ్‌సీఎల్, ఇండియా గ్లైకోస్ షేర్లు భారీ లాభాల్లో ఉండగా.. బజాజ్ హోల్డింగ్స్, ఈక్లిరిక్స్ సర్వీసెస్, సువెన్ ఫార్మా, స్యార్మా ఎస్‌జీఎస్ టెక్నాలజీస్ షేర్లు అత్యధిక నష్టాల్లో ఉన్నాయి. డాలరుతో రూపాయి మారకం విలువ కుంగి రూ.83.16 వద్ద ఉంది. నిన్న అమెరికా మార్కెట్ సూచీలు లాభాల్లో ముగిశాయి. ఆ ప్రభావంతో ఆసియా-పసిఫిక్ మార్కెట్లలోని దాదాపు అన్ని ప్రధాన సూచీలు లాభాల్లో ఉన్నాయి. కొరియా సూచీ కేవోఎస్‌పీఐ నష్టాల్లో ఉండగా.. జపాన్ నిక్కీ, చైనా షాంఘై కాంపోజిట్, ఆస్ట్రేలియా ఎస్అండ్‌పీ ఏఎస్ఎక్స్ 200, హాంకాంగ్‌కు చెందిన హెంగ్‌సెంగ్, తైవాన్ ఎస్ఈ సూచీలు లాభాల్లో ఉన్నాయి.




# చనిపోయిన తొమ్మిదిన్నరేళ్లకు యూడీఐడీ కార్డు

జగిత్యాల జిల్లా మల్యాల మండలం ముత్యంపేటకు చెందిన మర్రి గంగరాజం(70) ఇంటికి కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన యూనీక్ డిజెబిలిటీ ఐడెండిటీ(యూడీఐడీ) కార్డు పోస్టు ద్వారా వచ్చింది. దాన్ని చూసి ఆయన కుటుంబసభ్యులు విస్మయానికి గురయ్యారు. ఎందుకంటే గంగరాజం చనిపోయి తొమ్మిదిన్నరేళ్లు అవుతుండటమే. దివ్యాంగులకు రాష్ట్రాలు జారీ చేసే సదరం ధ్రువపత్రాల ఆధారంగా కేంద్ర మంత్రిత్వశాఖ యూనివర్సల్ ఐడీ, వైకల్యం ధ్రువపత్రాలను అందించడంలో భాగంగా యూడీఐడీ కార్డు జారీ చేస్తుంది. దీనితో దివ్యాంగుల పింఛను ఇతరత్రా సదుపాయాలు పొందడానికి అవకాశం ఉంటుంది.



# మరో ప్రయోగానికి సిద్ధమైన ఇస్రో..!

## జనవరి 1న నింగిలోకి ఎక్స్‌పోశాట్..!

ఇస్రో మరో ప్రతిష్టాత్మక ప్రయోగానికి సిద్ధమైంది. బ్లాక్ హోల్స్ (కృష్ణ బిలాలు), న్యూట్రాన్ స్టార్స్.. వివిధ ఖగోళ వస్తువుల నుంచి వెలువడుతున్న అత్యంత తీక్షణమైన ఎక్స్-కిరణాల అధ్యయనానికి మొట్టమొదటిసారిగా పోలారిమెట్రి మిషన్ చేపడుతున్నది. పీఎస్ఎల్‌వీ-సీ58 ద్వారా 'ఎక్స్‌పో-శాట్' శాటిలైట్‌ను జనవరి 1న ఉదయం 9.10 గంటలకు అంతరిక్షంలోకి పంపుతున్నట్టు ఇస్రో తాజాగా వెల్లడించింది.